క్లుప్తంగా

గిరిజన ఉద్యోగికి న్యాయం చేయండి

ఆత్మకూరు: కావలి తహసీల్దార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన గిరిజన ఉద్యోగి చలంచర్ల సాయిబాబా పదవీ విరమణ విషయంలో కొందరు అధికారులు తప్పులు చేశారని, అతడికి న్యాయం చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శేషం సుదర్శన్ అన్నారు. ఆత్మకూరులో మంగళవారం ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించిన ఎస్‌ఆర్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగి ఆధీనంలో ఉంటుందని, అలాంటప్పుడు ఇతరులు ఆ ఎస్‌ఆర్‌ను దిద్దేందుకు ఎలా అవకాశం కలుగుతుందని ప్రశ్నించారు. డ్రాయింగ్ ఆఫీసర్ జీతాల బిల్లు పెట్టారని, వారిపై చర్యలు తీసుకోకుండా గిరిజన ఉద్యోగిపైనే కేసు పెట్టడం దారుణమన్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

13న ప్రత్యేక మహాజన సభ సమావేశం

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం పీఏసీఎస్‌లో ఈనెల 13న ప్రత్యేక మహాజన సభ సమావేశం జరుగుతుందని సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంఘ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి ఆగస్ 31వ తేదీ వరకు జరిగిన సంఘ లావాదేవీలు, జమ, ఖర్చులు పరిశీలించి ఆమోదించడం, బకాయిదారులపై చర్యలు తీసుకోవడం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సంగం: మండల కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ గోపీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ పనులపై అధికారులు శాఖల వారీగా వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సోమ్లానాయక్, అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ఖాజా నాయబ్ రసూల్ దర్గా రెండో గేటు వద్ద గుర్తుతెలియని మహిళ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. ఆమె వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. ఆమె వివరాలు తెలిసిన వారు 91543 05605, 94407 00012 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సైదులు కోరారు. మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెరువు ఆక్రమణపై విచారణ

సోమశిల: మండల పరిధిలోని బొమ్మవరం చెరువులో కొంత భాగాన్ని ఆక్రమించారని గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో మంగళవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. డీటీ గిరీష్, ఇరిగేషన్ ఏఈ ఖాదర్‌బాషా సర్వే నంబర్ 217లో ఉన్న ఐదెకరాల భూమికి సంబంధించి విచారణ చేపట్టి హద్దు రాళ్లు, హెచ్చరికబోర్డును ఏర్పాటు చేయించారు. సదరు భూమిలో పామాయిల్ చెట్లు వేసి ఉన్నారని, ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

హెల్మెట్ ధరించాలి

ఆత్మకూరు: పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎస్సై షేక్ జిలానీ మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించారు. మోటార్‌బైక్‌లు, కార్లు ఆపి వాటి రికార్డులను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

స్నేహితుల మధ్య వివాదం

- బీరు బాటిల్‌తో దాడి

ఆత్మకూరు: స్నేహితుల మధ్య వివాదం జరిగి బీరు బాటిల్‌తో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని వాశిలి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై షేక్ జిలానీ కథనం మేరకు.. వాశిలికి చెందిన శివ, పవన్ స్నేహితులు. ఇద్దరూ కలిసి మద్యం తాగుతుండగా వివాదం నెలకొని గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన శివ బీరు బాటిల్‌తో పవన్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో అతని తలపై గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పవన్‌ను చికిత్స కోసం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెత్త చెత్తగా..

మండల కేంద్రమైన ఏఎస్‌పేటకు ఎంతో పేరుంది. ఇక్కడ పవిత్ర పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దర్గా ఉంది. దీనికి ఏపీలోని జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమై ప్రజారోగ్యాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

- ఏఎస్‌పేటలో అధ్వానంగా ప్రధాన కాలువ
- చెత్తాచెదారంతో పూడిపోయిన వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- పూడిక తీయించాలని కోరుతున్న జనం



చెత్తతో నిండిపోయిన బస్టాండ్‌లోని ప్రధాన కాలువ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని ప్రధాన కాలువల్లో పూడిక తీయించపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహం సమీపంలోని మురుగు కాలువ పూడిపోయింది. దర్గాకు వెళ్లేందుకు ఈ బస్టాండ్‌కు రోజూ అనేకమంది వస్తుంటారు. తీవ్ర దుర్వాసనతో వారంతా ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కన కాలువలు నిర్మించకుండా తవ్వి వదిలేశారు. అక్కడంతా చెత్త పేరుకుపోయింది. ఇళ్లు, దుకాణాల నుంచి వచ్చే మురుగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పూడిక తీయకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై చేరుతోంది. దీనివల్ల రోగాలు వస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం

తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఉండే ఈ కాలువ దుర్వాసన వెదజల్లుతున్నా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఈ దారిలోనే తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శితో పాటు అనేకమంది అధికారులు, సిబ్బంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పూడికతీత గురించి పట్టించుకునేనాథుడే లేడు. పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాల్సిన పంచాయతీ కార్యదర్శి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. భారీ వర్షాలు కురిసి సమస్య మరింత పెద్దది కాకముందే ఉన్నతాధికారులు దృష్టి సారించి పూడిక తీయించాలని ప్రజానీకం కోరుతోంది.

పూడిక తీయించండి



మండల కేంద్రంలో కాలువలు పూడిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి పూడిక తీయించాలి.

– షౌకత్ అలీ

భక్తులు ఇబ్బంది పడుతున్నారు



మండల కేంద్రంలో కాలువల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. తవ్వి వదిలేయడంతో చెత్త పేరుకుపోయింది. పందులు తిరుగుతున్నాయి. దుర్వాసనకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే కాలువల్లో మురుగునీరు రోడ్లపై చేరుతోంది. మండల, పంచాయతీ అధికారులు తక్షణం స్పందించాలి.

– జకీర్

చంద్రబాబు ప్రభుత్వం విఫలం

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కావలి: 'విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైంది. అక్కడి ప్రజలు పదిరోజులుగా నరకం అనుభవిస్తున్నారు' అని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. 'ఇల్లు మొత్తం మునిగిపోయింది. వస్తువులు, సరుకుల్లేవు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. కట్టుబట్టలతో మిగిలాం' అంటూ ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చాలాచోట్ల గ్రౌండ్ ఫ్లోర్ కూడా కనిపించలేదని, ప్రజలంతా రెండు, మూడు అంతస్తుల నుంచి సహాయం కోసం విన్నవిస్తూ కనిపించారన్నారు. విజయవాడ ఒక నదిలో ఉన్నట్లు కనిపించిందన్నారు. పదిరోజులు గడిచిన తర్వాత కూడా అక్కడ కొన్ని కాలనీల్లో మోకాలి లోతు నీరు నిల్వ ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయిందన్నారు. తర్వాత బాధితులను ఆదుకోవడంలో కూడా చేతకానితనాన్ని ప్రదర్శించిందన్నారు. వాతావరణ శాఖ, నీటిపారుదల విభాగం బుడమేరు వరద విషయాన్ని ముందస్తుగా ప్రభుత్వానికి తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించడం, కనీస వసతుల కల్పన, ఆహారం, నీరు అందించడం తదితర చర్యలను తక్షణం చేపట్టలేదన్నారు. అసలు సర్కారు ప్రజలను అప్రమత్తం చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కేవలం సీఎం చంద్రబాబు ఇల్లు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారన్నారు. దీనివల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వరదలు ముంచెత్తిన తర్వాత ప్రజలు తమకు తాముగా సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నం చేశారని, ఈ క్రమంలోనే 50 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అధికారులను వెంట వేసుకుని తిరగడం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదన్నారు. రోజుకు మూడు, నాలుగుసార్లు ప్రెస్‌మీట్లు పెట్టి అంతా తానే చేస్తున్నట్టు భ్రమ కల్పించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజలు దృష్టిని మళ్లించేందుకు మూడేళ్ల క్రితం జరిగిన సంఘటనలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు, కృష్ణా బ్యారేజ్ కూల్చేందుకు కుట్రలంటూ దుర్మార్గమైన ప్రచారాలకు చంద్రబాబు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఉపాధిలో రూ.3.80 లక్షల రికవరీకి ఆదేశం



దుత్తలూరు: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో రూ.3,80,174 అవినీతి జరిగినట్లు గుర్తించామని, ఆ మొత్తాన్ని రికవరీకి ఆదేశించామని డ్వామా అడిషనల్ పీడీ విజయలక్ష్మి తెలిపారు. 17వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు మండలంలో కూలీల కింద రూ.7,34,10,733, మెటీరియల్ కింద రూ.1,41,17,759 ఖర్చు చేయగా, వీటికి సంబంధించి 17 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పనులు పరిశీలించి అనంతరం సభలు నిర్వహించాయి. పరిశీలించిన అంశాలపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ చర్చా వేదిక ఏర్పాటు చేశారు. రూ.3,80,174 అవినీతి జరిగినట్లు తేల్చారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ మాట్లాడుతూ ఈ నగదును ఈసీ, టీఏ, ఎఫ్‌ఏల ద్వారా రికవరీకి ఆదేశించామని, వారికి జిల్లా కార్యాలయం నుంచి త్వరలో నోటీసులు అందజేస్తామన్నారు. డబ్బును వెంటనే జమ చేయాలన్నారు. అంతే కాకుండా ఇకపై అలాంటి తప్పులు చేయొద్దని చెప్పారు. ఉపాధిలో అక్రమాలు సహించబోమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ గాయత్రీ, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, ఈసీ కిశోర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సంధ్యాలక్ష్మి, పంచాయతీ రాజ్ ఏఈ రవీంద్రనాథ్, ఉపాధి హామీ ఏపీఓ బ్రహ్మయ్య, ఈసీ శ్రీనివాసులు, ఎస్సార్పీ నాగార్జున పాల్గొన్నారు.

టైలర్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు టైలర్ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏఎస్‌పేటకు చెందిన షేక్ రసూల్ టైలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నినెలల క్రితం కీళ్ల జబ్బుకు లోనై మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఇల్లు గడవడం కష్టమైంది. ఈ నేపథ్యంలో అతని భార్యకు గుండె జబ్బు వచ్చింది. ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ జె.ప్రణీత్ డాక్టర్ వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంగళవారం తన కార్యాలయంలో రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ప్రతి నెలా నిత్యావసర వస్తువులు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే వైద్యం చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు, ట్రస్ట్ సభ్యులు వెంకట సందీప్, కుమార్, అశోక్, టైలర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న కాలనీవాసులు

సోమశిల: తమపై అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేశాడని అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లిలోని ఎస్సీ కాలనీవాసులు వాపోయారు. మంగళవారం వారు వివరాలు వెల్లడించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని సోమవారం అక్కడి యువత నిమజ్జనానికి తరలించారు. ఈ సమయంలో గ్రామానికి చెందిన కరివేటి బత్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దౌర్జన్యం చేశాడని కాలనీవాసులు వాపోయారు. మా విగ్రహం కంటే ముందు మీ విగ్రహాన్ని ఎలా నిమజ్జనానికి తరలిస్తారంటూ ఆటంకం కలిగించినట్లు తెలిపారు. ఈ విషయమై ఎస్సీలు మంగళవారం అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ఉదయగిరి: కొట్టాలపల్లి వ్యవసాయ సహకార ప్రాథమిక సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి పి.శ్రీనివాసులురెడ్డి, సీఈఓ ఆర్.పోలయ్య తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మంగళవారం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత, కౌలుభూమి లేని, కొన్నేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులను తొలగించడం జరుగుతుందన్నారు. సొసైటీల కంప్యూటరీకరణలో భాగంగా సభ్యులు పొలం, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబర్‌ను కార్యాలయంలో అందజేసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లను సభ్యత్వం నుంచి తొలగిస్తామన్నారు. వాయిదాలు మీరిన బకాయిదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీరువా వితరణ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి మంగళవారం విశ్రాంత ఉపాధ్యాయుడు బాలచెన్నయ్య రూ.10 వేలు విలువ చేసే బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుసూదన్ రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంచల బాబు, ఇతర ఉపాధ్యాయులు నరసింహులు, జీవీ ప్రసాద్, బి.వెంకటేశ్వరరావు, శివ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాసరెడ్డి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని కొన్ని లేఅవుట్లలో అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని కొందరు ఫిర్యాదు చేయడంతో ట్రాన్స్‌కో జిల్లా విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలోని పది లేఅవుట్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. విద్యుత్ అధికారుల ద్వారా రికార్డులను తెప్పించుకుని తనిఖీలు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకుడు సుబ్బయ్య, చిన్నయ్య, డానియేల్, మధు, బాబు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పౌష్టికాహార మాసోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

వింజమూరు(ఉదయగిరి): పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా వింజమూరు ప్రాజెక్ట్ పరిధిలోని కొండాపురం మండలం కోవివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ బి.శ్రీదేవి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన రాగులు, జొన్నలు, సజ్జలు, మినుములు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.పావని, కె.జయమ్మ, ఎస్.కృష్ణవేణి, ఆర్.మాధవి పాల్గొన్నారు.

- ఆత్మకూరురూరల్: మండలంలోని ఆరవీడు జంగాలపల్లిలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, విజేత, అనసూయ, సామ్రాజ్యం పాల్గొన్నారు.
- చిట్టమూరు: తల్లీబిడ్డల ఆరోగ్యం సమతుల పోషకాహారంపైనే ఆధారపడి ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య అన్నారు. జక్కేపల్లిగూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.
- జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ అరుణకుమారి పాల్గొని మాట్లాడారు.

ఆర్ఎస్సార్ కళాశాల పాలకమండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న రామిరెడ్డి తదితరులు

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పాలకమండలి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. కళాశాలలో బోధన, పరిపాలన, నూతన వసతుల కల్పన, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ ట్రస్టీలు రామిరెడ్డి బాలసాకేత్‌రెడ్డి, మహిమారెడ్డి, అనంతపురం జేఎన్‌టీయూ అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఎ.సురేష్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వీరనారాయణరెడ్డి, పరిపాలనాధికారి ఆర్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహించలేదని ఫిర్యాదు

చేజర్ల: మండలంలోని మాముడూరు చెరువుకు సంబంధించి చేపల వేలం పాట నిర్వహించలేదని పలువురు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులోని వివరాల మేరకు.. 10వ తేదీ వేలం పాట జరుగుతుందని పత్రికలో ప్రకటన ఇచ్చారు. అయితే కార్యక్రమాన్ని పంచాయతీ సెక్రటరీ నిర్వహించలేదు. సెక్రటరీ కొందరు వ్యక్తులతో కలిసి ప్రభుత్వాదాయానికి గండి కొట్టాలని ప్రయత్నిస్తున్నాడంటూ ఏఎస్సై నాగేంద్రకు ఫిర్యాదు చేశారు. పాటదారులు ఎ.రంగారావు, నారాయణరావు, బాలయ్య కె.నరేంద్ర సుధాకర్, బాబు పాల్గొన్నారు.

టీచర్‌కు సన్మానం



అల్లూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న పి.చెంచయ్యకు మంగళవారం సన్మానం చేశారు. ఈయన అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం టీచర్‌గా పనిచేస్తున్నారు. స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర, సునీత పాల్గొన్నారు.

నవోదయలో వైద్య శిబిరం

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, కృష్ణాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వంశీ, సంక్రమిత రోగాల నివారణ డాక్టర్ భాస్కర్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- చేజర్ల: మండలంలోని మడపల్లి గ్రంథాలయం పక్కన 104 ద్వారా మంగళవారం సుమారు 56 మందికి బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మస్తానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, ఆశావర్కర్లు నిర్మల, సుబరత్నమ్మ పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వరికుంటపాడు: వైద్యారోగ్య సిబ్బంది జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని భోగ్యంవారిపల్లెను సందర్శించారు. లార్వా, జ్వరాల సర్వేను తనిఖీ చేశారు. వైద్య శిబిరాన్ని సందర్శించారు. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కరిష్మా, మలేరియా సబ్ యూనిట్ అధికారులు ఆంజనేయవర్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



ఉదయగిరి: స్థానిక రేడియంట్స్ పాఠశాల విద్యార్థినులకు మంగళవారం జమాతే ఇస్లామిక్ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. 6 నుంచి 10 తరగతుల విద్యార్థినులకు నైతికత – నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సనా, మహమ్మదీ, రెహానా, వసీమా, రుక్సానా, సాధియా, ఫర్హీన్, అమీరా తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



అనుమసముద్రంపేట: మండలంలోని చిరమన సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పారిశుద్ధ్యానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షరీఫ్, ప్రతాప్, వీఆర్వో నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు జేజేలు



ఉదయగిరిలో..

ఉదయగిరి: వినాయక చవితి సందర్భంగా వింజమూరు, ఉదయగిరి మండలాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు మంగళవారం కూడా భక్తులు పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లతోపాటు ఆదూరుపల్లిలో గణపయ్య విగ్రహాలకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. చేజర్ల పడమటివీధిలో రామాలయం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.
- కొండాపురం: మండలంలోని కొమ్మి,అగ్రహారం, తూర్పు ఎర్రబల్లి, గరిమెనపెంట తదితర గ్రామాల్లో మంగళవారం ఉట్టి మహోత్సవాలు జరిగాయి. నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందించారు.